క్లుప్తంగా

బకరాల కుంటపై అసత్య ప్రచారం తగదు

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలో బకరాల కుంటను వైఎస్సార్ సీపీ నేతలు ఆక్రమిస్తున్నారని చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క సెంటు కూడా ఆక్రమణకు గురి కాకుండా జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ సహకారంతో కుంట స్థలాన్ని కాపాడామని గుర్తు చేశారు. ఎవరో ఆక్రమిస్తుంటే దాన్ని మా పార్టీపైకి నెట్టాలని టీడీపీ నేతలు ప్రయత్నించడం హాస్యాస్పదమన్నారు. కుంట స్థలం ఆక్రమణపై తహసీల్దార్‌తో ఫోన్ లో మాట్లాడి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించి కుంటలో అక్రమంగా లేఅవుట్ వేసి ఆక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు బనాయిస్తానని చెప్పారని వివరించారు. ఇప్పటికైనా టీడీపీ కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని కోరారు.

విత్తన శుద్ధిపై అవగాహన



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మందాకిని

కొండపి: రైతులు పిల్లిపెసర, ఉలవలు, మినుములు, జొన్న పంటల్లో విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోవాలని యూనిట్ ఇన్‌చార్జి మందాకిని అన్నారు. మండలంలోని నేతివారిపాలెంలోని రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అనేక లాభాలు ఉన్నాయన్నారు. అనంతరం నేతివారిపాలెం యూనిట్లో షేక్ మీరావలి పొలంలో విత్తనాలు శుద్ధి చేసి పొలంలో చల్లించారు. ఐసీఆర్పీలు జ్యోత్స్న, మస్తాన్ రైతులు పాల్గొన్నారు

కనిగిరి డిపోకు పది ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

కనిగిరి రూరల్: కనిగిరి ఆర్టీసీ డిపోకు దాతలు శెట్టిపల్లి కొండలరావు(బిల్డర్), వాణి దంపతులు ఆదివారం 10 సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపోకు దాతలు సహకారం అందించడాన్ని డీపో మేనేజర్ మహమ్మద్ సయాన అభినందించారు. అనంతరం దాతలను డిపో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కొటికర్ల బాదుర్ల, కోటపాటి రమణ, పాపాబత్తిని తిరుపతయ్య, మంద్రు రమేష్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైను మరమ్మతులకు రూ. 5 లక్షలు మంజూరు



పైపులైన్ పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్

టంగుటూరు: మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధిలోని వెలగపూడి, కెనుపాలెం గ్రామాలకు మంచినీరు అందించే పైపులైన్ రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులకు గురైంది. దీంతో 10 రోజుల నుంచి గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులుపడుతున్నారు. విషయం గమనించిన ఎంపీపీ ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ ఎంపీపీ గ్రాంటు నుంచి మరమ్మతులకు రూ. 5 లక్షలు నిధులను మంజూరు చేశారు. దీంతో సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు యుద్ధప్రాతిపదితిన పైపులైను పనులు చేసి గ్రామాలకు మంచినీరు ఇస్తామని తెలిపారు.

బకరాల కుంటను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ స్థలమని ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న అధికారులు

సింగరాయకొండ: బకరాల కుంటను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ టి.రవి హెచ్చరించారు. ఇటీవల కొంతమంది తమ అనుమతి లేకుండా అక్రమంగా లేఅవుట్ వేశారని, దీనిపై స్థానికుల ఫిర్యాదుతో వీఆర్ఓ వెంకటాద్రిని పంపి విచారణ చేశామన్నారు. కుంట స్థలంలో ఎవరికి పట్టాలు ఇవ్వకూడదని, ఎవరైనా కుంట ఆక్రమణకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం కుంట స్థలంలో ఇది ప్రభుత్వభూమి అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని, లేఅవుట్ సందర్భంగా వేసిన హద్దురాళ్లను తొలగించినట్లు ఆయన వివరించారు.

ఆకలి మంటలతో 'ప్రాణదాతలు'

- 108 సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు చెల్లించని వైనం
- ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదన్న ఏజెన్సీ అరబిందో
- సక్రమంగా జీతాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న చిరుద్యోగులు



108 వాహనం

కందుకూరు: అత్యవసర సమయంలో ప్రాణాలు నిలిపే 108 వాహనాల సిబ్బందికి జీతాలు కరువయ్యాయి. దాదాపు మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉండటంతో అవస్థలు పడుతున్నారు. సకాలంలో జీతాలు చెల్లించాల్సిన ఏజెన్సీ అయిన అరబిందో సంస్థ, ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెపం వేస్తూ చిరుద్యోగుల కడుపు మాడుస్తున్నారు.

అప్పు చేస్తేనే ఇల్లు గడిచేది

కందుకూరు నియోజకవర్గంలో ఐదు 108 వాహనాలు తిరుగుతున్నాయి. వీటిలో కందుకూరు, గుడ్లూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం, ఉలవపాడు మండలానికి ఒకటి చొప్పున వాహనాలు కేటాయించారు. ప్రతి వాహనానికి నలుగురు చొప్పున సిబ్బంది, మరో రెండు వాహనాల్లో ఇద్దరు చొప్పున అదనపు సిబ్బంది పనిచేస్తున్నారు. మొత్తం ఐదు వాహనాల్లో 26 మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో పైలెట్ (వాహన డ్రైవర్)కు నెలకు రూ. 28వేల వరకు, ఈఎంటీకి రూ. 30 వేలు, కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి రూ. 20వేల వరకు జీతాలు చెల్లించాల్సి ఉంది. అయితే గత జూలై నుంచి ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా 108 సిబ్బంది జీతాలు చెల్లించలేదు. అంటే దాదాపు మూడు నెలలు గడిచి, నాలుగో నెల కూడా జరుగుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారీ ఇలా నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో పెట్టడం.. ఆందోళన చేసినప్పుడు ఒక నెలా, రెండు నెలల జీతాలు చెల్లించి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. దీంతో జీతాలపై ఆధారపడి కుటుంబాలను నెట్టుకొచ్చే తామంతా కుటుంబ నిర్వహణకు భారీగా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి బిల్లుల రాక

ప్రభుత్వం 108 వాహనాల నిర్వహణకు అరబిందో సంస్థకు అప్పజెప్పింది. వాహనాల నిర్వహణతో పాటు, సిబ్బంది జీతాలు కూడా ఆ సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. దీనికి గాను ఆ సంస్థకు ప్రభుత్వం పాత వాహనమైతే నెలకు రూ 2.20 లక్షలు, కొత్త వాహనమైతే రూ. 1.90 లక్షలు చెల్లిస్తుంది. వీటితోనే వాహనాల నిర్వహణ, సిబ్బంది జీతాలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అరబిందోకు చెల్లించాల్సిన బిల్లులను ఇంత వరకు చెల్లించలేదు. దీని వల్ల వాహనాల నిర్వహణ కష్టతరంగా మారింది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా రాకపోతే వాహనాల నిర్వహణ కూడా కుంటుపడుతుంది. దీని వల్ల అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు సకాలంలో గమ్యస్థానాన్ని చేరుకోలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు ఇవ్వడంతో పాటు, పాత వాహనాల స్థానంలో కొత్త వాహనాలను సకాలంలో అందించేదని సిబ్బంది గుర్తు చేసుకుంటున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 108 వాహనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విచారం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న పనిభారం

ప్రస్తుతం 108 సిబ్బందిపై పనిభారం అధికంగా ఉంటోంది. రోడ్డు ప్రమాదాలు పెరగడం, అత్యవసర కేసులు, ఏరియా హాస్పిటల్ నుంచి రిఫరల్ కేసులు అధికంగా ఉండటం వల్ల సిబ్బందిపై పనిభారం అధికమవుతోంది. రోడ్డు ప్రమాదాల సమయంలో సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వీలైనంత త్వరగా హాస్పిటల్స్‌కు చేర్చాల్సి ఉంటుంది. ఇక కందుకూరు ఏరియా హాస్పిటల్‌లో అత్యవసర కేసులకు చికిత్స అందించే పరిస్థితులు లేవు. దీని వల్ల ఇక్కడికి వచ్చిన అత్యవసర కేసులను, హై రిస్క్ పేషెంట్‌లను నిత్యం ఒంగోలుకు రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు. దీని వల్ల పగలు, రాత్రి అన్న తేడా లేకుండా 108 వాహనాలు తిరుగుతూనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో జీతాలు సక్రమంగా ఇవ్వకపోతే ఎలా పని చేయాలంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగోలుగా టెలిఫోన్ కేబుల్ తవ్వకాలు



నిబంధనలకు విరుద్ధంగా ఆర్అండ్‌బీ రహదారి ఆనుకొని తవ్వకాలు



మర్రిపూడి చెరువు కట్ట కింద కోనేటి బావి పక్కనే కందకం తవ్వడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు

- పగిలిపోయిన తాగునీటి పైపులు
- 9 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా

మర్రిపూడి: మండలంలో ఆ ప్రైవేట్ టెలిఫోన్ సంస్థ ఆర్అండ్‌బీ రోడ్ ఆనుకుని అడ్డగోలు కందకాలు తవ్వేస్తుండటంతో తాగునీటి పైపులు పగిలిపోయాయి. దీంతో 9 గ్రామాలకు మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టెలిఫోన్ కేబుల్ ఏర్పాటు కోసం మర్రిపూడి చెరువు కట్ట కింద గుంత తీస్తున్న క్రమంలో సాగర్ నీటికోసం ఏర్పాటుచేసిన పైపులు పగిలిపోవడంతో మండలంలోని గుండ్లసముద్రం, రేగలగడ్డ, ఎస్టీ రాజుపాలెం, కెల్లంపల్లి, పిన్నికవారిపాలెం, పన్నూరు, శివరాయునిపేట, చిలంకూరు, మర్రిపూడి తదితర గ్రామాలకు మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర నీటి ఎద్దడికి గురవుతున్నారు. ఆర్అండ్‌బీ రహదారి మార్జిన్‌కు సుమారు రెండు మీటర్లు దూరంలో కందకాలు తీసుకోవాలని నిబంధనలు చెబుతున్నా, ఆ ప్రైవేట్ టెలిఫోన్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ఎన్నో ఇబ్బందులు..

నిబంధనలకు విరుద్ధంగా ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకొని ఇష్టానుసారంగా కందకాలు తవ్వేస్తుండటంతో మూగజీవాలు ఆ గుంతలో పడి ఇబ్బందులు పడుతున్నాయి. మర్రిపూడి చెరువుకట్ట కింద పురాతన కాలంనాటి కోటిబావి గోడ కూలింది. ఆ బావి పక్కనే కేబుల్ ఏర్పాటుకోసం కందకాలు ఇష్టానుసారంగా తీయడంతో ఆ ప్రదేశం వాహనాదారులకు అత్యంత ప్రమాదకరంగా మారింది. వాహనాలు ఎదురుపడ్డప్పుడు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. మండలంలో గంగపాలెం, రేగలడ్డ, గుండ్లసముద్రం, మర్రిపూడి తదితర గ్రామాల్లో ఆర్అండ్‌బీ రహదారి పక్కనే కేబుల్ ఏర్పాటుకోసం తీసిన గుంతల్లో పశువులు పడి ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు జరిగాయి. రేగలగడ్డ బస్టాండ్ సమీపంలోని చెరువు కట్ట చప్టా మలుపులో రోడ్‌ను ఆనుకుని గుంట తీయడంతో ఏ సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. మర్రిపూడి చెరువు కట్ట కింద ఉన్న నేర్ల బావి వద్ద రోడ్ మార్జిన్ లో కందకం తీయడంతో వర్షానికి రోడ్‌మార్జిన్ పూర్తిగా దెబ్బతిని ట్రాక్టర్ ఇరుక్కుపోయింది. ఆర్అండ్‌బీ అధికారుల హెచ్చరికలను సైతం బేఖాతరు చేస్తూ పనులు కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ టెలిఫోన్ సంస్థ కందకం తవ్వడం నిబంధనలకు విరుద్ధగా ఉన్నాయని, తాము హెచ్చరించినా అడ్డగోలుగా పనుల చేస్తున్నారని ఆర్అండ్‌బీ ఏఈ దీప్తి పేర్కొన్నారు.



తాగునీటి పైపులు పగిలి వృథాగా పోతున్న నీరు

ఆర్ఎంపీలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మూత వేయించిన కేంద్రాలు

ఉలవపాడు: నిబంధనలు అతిక్రమించి ఆర్ఎంపీలు వైద్యంచేస్తే సహించేది లేదని కరేడు వైద్యాధికారి శ్రీనివాసులు ఆదివారం హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన ఆదివారం ఆర్ఎంపీ సెంటర్లను తనిఖీ చేశారు. ఆర్ఎంపీ సెంటర్లను మూసి వేయించారు. వారంతా ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని సెలైన్లు పెట్టడం గానీ ఇంజక్షన్లు వేయడం కానీ చేయవద్దని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా జాగ్రత్త వహించాలన్నారు. రోగులకు ఇచ్చే మాత్రల్లో స్టెరాయిడ్‌లు ఉండకూడదన్నారు. ఇక నుంచి ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తామని.. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి వైద్యం చేస్తే క్రిమినల్ చర్యలకు వెనుకాడబోమన్నారు. తనిఖీలకు సంబంధించిన నివేదిక జిల్లా అధికారులకు అందిస్తామని చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పట్టణ ఎస్సై సాంబశివయ్య తెలిపారు. పామూరు రోడ్డులోని వెంగమాంబ ఫంక్షన్ హాలులో ఈ రక్తదాన శిబిరం జరుగుతుందని చెప్పారు. ప్రజలు, యువకులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని జయప్రదం చేయాలని, రక్తదానం చేయదల్చిన వారు ముందుగా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు

రాళ్లపాడు కాలువల్లో పూడికతీత పనులు




కుడి కాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌వేటర్

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు జేఈ చంద్రమౌళి తెలిపారు. కుడి కాలువలో నాలుగు ఎక్స్‌వేటర్ల ద్వారా పూడితీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. జంగాలపల్లె బ్రాంచి కాలువలో కూడా పూడికతీత పనులు జరుగుతున్నట్లు తెలిపారు. మూడు రోజుల నుంచి కుడి కాలువ పూడికతీత పనులు గుడ్లూరు మండలం పూరేటిపల్లె నుంచి పనులు మెదలు పెట్టినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి కొండాపురం మండలం సాయిపేట వద్ద పూడికతీత చేస్తున్నట్లు తెలిపారు. రెండు లేదా మూడు రోజుల్లో కుడి, ఎడమ కాలువల్లో పూడికతీయడం పూర్తవుతుందని చెప్పారు.

కార్తీక మాసంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కందుకూరు: కార్తీక మాసం సందర్భంగా యాత్రా స్పెషల్ పేరుతో పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపున్నట్లు ఇన్‌చార్జి డీఎం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి కార్తీక సోమవారం సందర్భంగా అరుణాచాలానికి బస్సు నడుపుతామని తెలిపారు. దీనిలో ఒక్కొక్కరికి టికెట్ ధర రూ. 2100 ఉంటుందన్నారు. అరుణాచలం యాత్రకు ప్రతి శనివారం కందుకూరు ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. పంచారామ క్షేత్రాలకు, అన్నవరం, కుండాలేశ్వరం పుణ్యక్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములకు కిలో మీటర్‌కు రూ. 57 చొప్పున అద్దెకు బస్సులు పంపిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 7382889870, 8328586114 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రైతు ఇంట ధాన్యరాశులు కురవాలి!



గింజలు చల్లేందుకు నారుమడి తయారు చేస్తున్న రైతులు

లింగసముద్రం: ఈ సీజన్‌లో కురిసిన వర్షాలు అన్నదాతలకు ఆనందాన్ని ఇస్తున్నాయి. వర్షాలు కురిసి వాగులు, వంకల్లోకి నీరు చేరడంతో పాటు, భూగర్భజలాలు కొంత మేర పైకి చేరడంతో బోర్ల కింద రైతులు వరినార్లు పోస్తున్నారు. మన్నేరు పరీవాహక ప్రాంత గ్రామాలైన రాళ్లపాడు, చీమలపెంట, తూనుగుంట, వీర్ కోట, అన్నెబోయినపల్లె, అంగిరేకులపాడు, ఉప్పుటేరు పరివాహక ప్రాంత గ్రామాలు, మేదర మిట్లపాలెం, పెదపవని, చినపవని, ముత్యాలపాడు తదితర గ్రామాలు, మొగిలిచర్ల, ఎర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, వెంగళాపురం మాలకొండ్రాయునిపాలెం గ్రామాల్లో బోర్ల కింద రైతులు వరినార్లు పోస్తున్నారు. రైతులు సన్న రకాలైన కేఎస్ఎం 1638 రకం వరి విత్తనం ఎంచుకుని నారు పోస్తున్నారు. అయితే 25 కేజీల విత్తనాలు రూ.1100 కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. కావలి, లింగసముద్రంలో కొనుగోలు చేస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి గ్రామాల్లో వరి పంట పండకపోవడంతో ఈసంవత్సరమైనా బోర్ల కింద పంట పండితే తిండి గింజలు, గేదెలకు మేతకు ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై జి. కోటయ్య

పీసీపల్లి: మండల పరిధిలోని సైబర్ నేరాలపై మండలంలోని గుంటుపల్లి, శంకరాపురం గ్రామాల్లో ఎస్సై జి.కోటయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాల తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరానికి గురైతే వెంటనే తీసుకోవాల్సిన చర్యలను గ్రామస్తులకు వివరించారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరుబయట పడుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రిళ్లు ఆరుబయట ఉన్న వాహనాలు, గేదెలను దొంగిలిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఈఓ, భక్తులు



గోపూజలో పాల్గొన్న ఈఓ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, పందిటి హరీష్, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



వార్డులో పర్యటిస్తున్న చైర్మన గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని నీటి సమస్య శాశ్వత పరిష్కారంకు చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని మూడవ వార్డు శంకవరం ఆయన పర్యటించారు. స్థానికులు నీటి సమస్య, విద్యుత్, పారిశుధ్యం సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పైప్‌లైన్ ద్వారా వార్డులోని అన్ని వీధుల్లో నీటి కుళాయిలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, మీరావలి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేస్తున్న విద్యుత్ టవర్ల నిర్మాణాలను పరిశీలించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్యశిబిరం



మెడికల్ క్యాంప్‌లో డాక్టర్ మణిదీపిక తదితరులు

వలేటివారిపాలెం: మండలంలోని కాకర్లపాలెం, అమ్మపాలెం గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరం.. వలేటివారిపాలెం వైద్యాధికారి డాక్టర్ మణి దీపిక ఆదివారం ఏర్పాటు చేశారు. మండలంలోని కాకర్లపాలెం, అమ్మపాలెం గ్రామాల్లో కలిపి 50 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులను పరీక్షించి రక్తం తక్కువ శాతం ఉన్న మహిళలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వృద్ధులకు, వికలాంగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వర్షకాలం ప్రభావం వలన ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందువలన ఈ ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయించామని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు ఎక్కువ శాతం నాణ్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అలాంటప్పుడే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు ఏఎన్ఎంలు ద్వారా ప్రతి వారం పరీక్షలు చేయించుకోవాలని, అలాగే ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు. ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, ఉద్దేశించి మాట్లాడుతూ వాతావరణ శాఖ వారు తుఫాన్ హెచ్చరిక ఇచ్చిన కారణంగా ప్రజలకు ఈ సమయంలో తప్పక అందుబాటులో ఉండాలన్నారు. ఏఎన్ఎం ప్రమీల, ఆశ వర్కర్లు , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయండి



గుంతలు పడి ఉన్న తారు రోడ్డు

కందుకూరు రూరల్: మండలంలోని చిన ఓగూరు వెళ్లే తారు రోడ్డు గుంతలు పడి ఉంది. ఆ తారు రోడ్డుపై గుంతలు పడటంతో వర్షపు నీరు నిల్వ చేరుతున్నాయి. దీంతో గుంత ఎంత లోతు ఉందో కూడా తెలియని పరిస్థితి. ఓగూరు గ్రామ వద్ద ఓవీ రోడ్డు నుంచి చిన ఓగూరు, గ్రామ సచివాలయానికి ఈ రోడ్డులో నుంచే వెళ్లాలి. తారు రోడ్డులో అక్కడక్కడా పెద్ద గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షాలు కురిసినప్పుడు నీరు నిల్వ చేరుతున్నాయి. వేగంగా వెళ్లే వాహనదారులు గుంతలు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలకు కనీసం మట్టి పోసి అయినా పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.